


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



సోమవారం 29-06-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :12 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## ఇరాన్ అనే దేశమే లేకుండా చేస్తా

### డొనాల్డ్ ట్రంప్ భయంకర హెచ్చరిక




- మళ్లీ ముదిరిన అమెరికా–ఇరాన్ ఉద్రిక్తత
- ప్రతీకార దాడులతో పశ్చిమాసియా ఉద్రిక్తం
- కువైట్, బహ్రెయిన్‌లో క్షిపణుల కలకలం
- యుద్ధ మేఘాలతో ప్రపంచ ఆందోళన

## రాహుల్ గాంధీ మిస్సింగ్

### రాజధానిలో పోస్టర్ల కలకలం




- ఢిల్లీలో మిస్సింగ్ పోస్టర్ల కలకలం
- రాహుల్‌పై బీజేపీ విమర్శల వర్షం
- 'లీడర్ ఆఫ్ పర్యటన్' అంటూ ఎద్దేవా
- విదేశీ పర్యటనలపై రాజకీయ రగడ
- రాజధానిలో పోస్టర్లతో హీట్
- పోస్టర్లతో కొత్త రాజకీయ దుమారం

**న్యూస్ డెస్క్, 28 జూన్ (ఇది కద నిజం):** లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లారని బీజేపీ తీవ్రవిమర్శలు చేస్తున్న క్రమంలో.. దేశ రాజధాని ఢిల్లీలోని ఫిరోజ్ షా రోడ్డుతో సహా పలు ప్రాంతాల్లో ఆయన కనిపించడం లేదని వెలిసిన పోస్టర్లు కలకలం రేపుతున్నాయి.

## ఉండవల్లి ఘటన

### అంబటి రాంబాబు, పేర్ని నానిలపై అట్రాసిటీ కేసు




- వైసీపీ నేతలపై పోలీసుల చర్యలు
- రాళ్లదాడి కోణంలో దర్యాప్తు
- పోలీసుల విచారణ ముమ్మరం
- ఉద్రిక్తతకు కారణాలపై ఆరా

**న్యూస్ డెస్క్, 28 జూన్ (ఇది కద నిజం):** రాజధాని అమరావతి పరిధిలోని ఉండవల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బృందం పర్యటన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన విషయం తెలిసిందే. ఈ ఘర్షణలపై తాడేపల్లి పోలీసులకు అందిన వేర్వేరు ఫిర్యాదుల మేరకు మూడు కేసులు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు. పెనుమాకకు చెందిన మాణిక్యం అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని సహా వైసీపీ నాయకులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

వైసీపీ నేతల పర్యటన సమయంలో విధుల్లో పోలీస్ అధికారిని నెట్టివేసినందుకు అంబటి రాంబాబుపై సీఐ వీరేంద్రబాబు స్వయంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అంబటిపై పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 కింద కేసు నమోదయింది.

## పేదల ఇళ్ల జోలికి వస్తే ఈ ప్రభుత్వాన్ని కూల్చివేస్తాం

- పేదల ఇళ్ల కూల్చివేతపై ఆగ్రహం
- భూకబ్జాదారులపై చర్యలు ఎక్కడ?
- హైడ్రాకు దమ్ముంటే వారినే శిక్షించాలి
- పేదల ఇళ్ల జోలికి వస్తే పోరాటమే
- ప్రభుత్వానికి ఈటల తీవ్ర హెచ్చరిక




## ఇందిరమ్మ ఇళ్లకు కొత్త రూల్స్

### స్లాబ్ పెద్దదైతే డబ్బులు కట్.!




## టీటీడీకి రూ.27.5 కోట్ల భారీ విరాళం

### 50 మంది డ్రైవర్లు, ఛార్జింగ్ స్టేషన్ కూడా!

- టీటీడీకి అంబానీ భారీ కానుక
- రూ.27.5 కోట్లతో ఈ–బస్సుల విరాళం
- ఛార్జింగ్ స్టేషన్లూ రిలయన్స్‌దే
- తిరుమలకు గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్ బూస్ట్
- గోశాల ఆధునీకరణకూ సహకారం

2 లో

## రైతులకు తీపి కబురు



- రూ.8 వేల సాయం
- పంటల మార్పిడికి ప్రోత్సాహం
- 25 లక్షల ఎకరాల లక్ష్యం
- రైతు భరోసా ప్లస్
- ప్రత్యామ్నాయ పంటలకే బలం
- ప్రత్యేక పంట బీమా
- కేబినెట్‌లో కీలక నిర్ణయం


**న్యూస్ డెస్క్, 28 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణలో సుస్థిర వ్యవసాయాభివృద్ధి, రైతులకు ఆదాయ భద్రత, పటిష్ట గ్రామీణ ఆర్థిక వ్యవస్థే ధ్యేయంగా రూపొందించిన సమగ్ర వ్యవసాయ విధానం–2026 అమలు చేయాలని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రస్తుత సమస్యల నేపథ్యంలో.. అగ్రి వర్సిటీని నోడల్ ఏజన్సీగా ప్రకటిస్తూ నూతన విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వం గతంలో ఆదేశించింది. దీని ప్రకారం.. వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య నేతృత్వంలోని సుస్థిర వ్యవసాయ, అభివృద్ధి అధ్యయన కేంద్రం జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులపై సమగ్రంగా అధ్యయనం చేసి నివేదికను సిద్ధం చేసింది. ఈ నివేదికను శనివారం రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించగా.. జులై 2న జరగబోయే కేబినెట్ సమావేశంలో దీనిపై సుదీర్ఘంగా చర్చించనున్నారు.

ఈ మార్పుల్లో భాగంగా.. రాబోయే ఐదేళ్లలో 25 లక్షల ఎకరాల వరి సాగు విస్తీర్ణాన్ని దశల వారీగా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

మిగతాది 2 లో..

## రాజకీయం అంటే పార్ట్ టైమ్ జాబ్ కాదు

### రాహుల్ గాంధీపై ప్రణబ్ ముఖర్జీ కూతురు కామెంట్స్




**న్యూస్ డెస్క్, 28 జూన్ (ఇది కద నిజం):** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠ ముఖర్జీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ కొంత కాలం క్షేత్రస్థాయిలో చురుకుగా ఉండి ఆ తర్వాత అకస్మాత్తుగా అదృశ్యమవుతారని ఆమె తప్పుబట్టారు. రాజకీయం అంటే పార్ట్ టైమ్ జాబ్ కాదని ఇది ఏడాదిలో 365 రోజులు, రోజుకు 24 గంటలు చేయాల్సిన ఫుల్ టైమ్ జాబ్ అని అన్నారు.

## తెలంగాణకు చేరిన బెజవాడ బ్రదర్స్ ఫైట్

### కేశినేని నానికి ఎంపీ చిన్ని కౌంటర్




## మైనర్ పై దారుణం


### 5 రోజుల్లో 30 మంది అత్యాచారం




- 13 ఏళ్ల బాలికపై సామూహిక దారుణం
- హోటళ్లలో జరిగిన ఘోర కాండ
- రాజస్థాన్‌ను కుదిపేసిన ఘటన
- నిందితులకు ఉరిశిక్ష డిమాండ్

## జపాన్‌లో భారీ భూకంపం

### సునామీ హెచ్చరికలు?




- 6.1 తీవ్రతతో భూమి కంపించింది
- సునామీ ముప్పు లేదన్న అధికారులు
- కొండచరియలపై హెచ్చరికలు
- వరుస భూకంపాలతో ప్రపంచం ఉలిక్కి
- అప్రమత్తంగా ఉండాలని సూచనలు

# రాహుల్ గాంధీ మిస్సింగ్.. రాజధానిలో పోస్టర్ల కలకలం

మొదటి పేజీ తరువాయి

పార్లమెంట్ సమావేశాలు, ఎన్నికలు, పార్టీకి అవసరం అయిన ప్రతిసారీ రాహుల్ గాంధీ అందుబాటులో ఉండరని బీజేపీ ఆరోపించిన మర్నాడే ఈ పోస్టర్లు వెలియడం చర్చకు దారితీసింది.

పీటీఐ కథనం ప్రకారం.. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై పదునైన విమర్శలు చేశారు. రాహుల్ గాంధీ.. లీడర్ ఆఫ్ అపోజిషన్ కాదని, లీడర్ ఆఫ్ పర్యటన్ అని, లీడర్ ఆఫ్ పార్టీయింగ్ అని ఎద్దేవా చేశారు. ఆయన ఎప్పుడూ విందులు, వినోదాలు, పర్యటనలకే ప్రాధాన్యమిస్తారని, అందుకే తన పదవి పేరును లీడర్ ఆఫ్ పర్యటన్ అండ్ పార్టీయింగ్ గా మార్చుకోవాలని విమర్శించారు. రాహుల్ గాంధీకి తన రాజకీయ బాధ్యతల కంటే విదేశీ పర్యటనలే ముఖ్యమని బీజేపీ ప్రతినిధి ఆరోపించారు. ఆయనకు ప్రజలు, పార్లమెంటు లేదా దేశం మొదటి ప్రాధాన్యత కాదని, కేవలం పర్యాటకమే పరమావధి అని మండిపడ్డారు. ప్రధాని మోడీ అత్యంత సుదీర్ఘకాలం పనిచేసిన నేతగా ఉంటే.. రాహుల్ మాత్రం సెలవుల్లో గడపడానికే ప్రాధాన్యతనిస్తారని విమర్శించారు.

# పేదల ఇళ్ల జోలికి వస్తే ఈ ప్రభుత్వాన్ని కూల్చివేస్తాం- ఈటల హెచ్చరిక



**న్యూస్ డెస్క్, 28 జూన్ (ఇది కద నిజం):** హైడ్రా తీరుపై ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రాకు భూకబ్జాదారులను శిక్షించే దమ్ములేదని, దమ్ముంటే భూమి కబ్జా చేసిన వారిని జైల్లో పెట్టాలన్నారు. ఆదివారం బోయినపల్లి, అస్మత్‌పేటలో పేదల ఇళ్లను హైడ్రా కూల్చివేతకు వ్యతిరేకంగా ఎంపీ ఈటల రాజేందర్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. హైడ్రాకు రాజకీయ నాయకుల పేరు ఎత్తే దమ్ము లేదన్నారు. హైడ్రాకు కనికరం లేదని, పేదలు ఆర్తనాదాలు చేస్తున్నా వారి ఇళ్లను కూల్చడమే పనిగా పెట్టుకుందన్నారు.

నోరులేని పేదలపై ప్రతాపమా?:

హైడ్రా దొంగచాటున కూల్చివేత్తలకు పాల్పడుతోందని నిజంగా హైడ్రాకు దమ్ముంటే ఇది ప్రభుత్వ భూమా? కాదా ఎంక్వైయిరీ చేయాలన్నారు. ఇది నిజంగానే ప్రభుత్వ భూమి అయితే ప్రభుత్వ భూమిలో లే హౌట్లు వేసింది ఎవరు? దీనికి సహకరించిన అధికారులు, రాజకీయ నాయకులు ఎవరో తేల్చి వారిని జైలుకు పంపించాలన్నారు. అది చేయకుండా నోరులేని పేదలపై ప్రతాపం చూపుతోందన్నారు. బాధితులు కోర్టుకు వెళ్లకుండా శనివారం, ఆదివారం హైడ్రా కూల్చివేతలు చేస్తున్నారన్నారు. ఇలాగే కూల్చివేతలు కొనసాగిస్తే హైదరాబాద్ లో ఏ ఒక్క బస్తీ మిగలదన్నారు. మీకు బుద్ధి జ్ఞానం ఉండాలి కదా అని ప్రశ్నించారు. పత్రాలు లేని పేదల భూములకు రెగ్యులరైజ్ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు కూల్చివేత్తలు చేయడం ఏంటని ప్రశ్నించారు. 70 ఏళ్లుగా ఇలాంటి రేవంత్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రి ఉంటే నగరంలో ఇంత మంది బతికేవారా? అని నిలదీశారు.

ప్రభుత్వాన్ని కూల్చివేస్తాం:

పేదల ఇండ్లు కూల్చివేస్తే ఈ ప్రభుత్వాన్ని కూల్చివేస్తామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ప్రజల వద్దకు మళ్లీ కాంగ్రెస్ రాదా? మీ నాయకులు రారా? అప్పుడు ప్రజలే మీ సంగతి తేలుస్తారన్నారు. ఈ భూములను బ్రోకర్లే అమ్మితే వారిని శిక్షించాలన్నారు. రెవెన్యూ శాఖలో అవినీతి మితిమీరిపోయిందని ఏ రెవెన్యూ అధికారి ఇంట్లో ఏసీబీ దాడి చేసినా నోట్ల కట్టలు బయటపడుతున్నాయని, ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నివాసంలో ఏసీబీ దాడులు చేస్తో కోట్లాది రూపాయలు దొరికాయని అధికారులు ఇంత లంచాలకు ఎగబడుతుంటే ఈ ప్రభుత్వానికి సిగ్గు ఉందా అని ప్రశ్నించారు.

# మైనర్ పై దారుణం.. 5 రోజుల్లో 30 మంది అత్యాచారం

**న్యూస్ డెస్క్, 28 జూన్ (ఇది కద నిజం):** దేశంలో అత్యంత ఘోరమైన, అమానుష ఘటన వెలుగుచూసింది. 13 ఏళ్ల మైనర్ బాలికపై 5 రోజులపాటు సుమారు 30 మందికి పైగా మృగాళ్లు పలు హోటళ్లలో అత్యాచారానికి ఒడిగట్టిన ఆరోపణలు వచ్చాయి. రాజస్థాన్లోని శ్రీ గంగనగర్లో ఈ ఘోరమైన ఘటన జరిగింది. ఇంటి నుంచి కనిపించకుండా పోయిన బాలికను రిక్షా కార్మికుడు హోటల్ యజమానికి విక్రయించాడు. దాంతో ఈ దారుణం ప్రారంభమైనట్లుగా బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఫైల్ చేసిన ఎఫ్ఐఆర్ ద్వారా తెలుస్తోంది. ఈ వికృత కాండలో పలువురు హోటల్ నిర్వాహకుల ప్రమేయం కూడా ఉన్నట్లు సమాచారం. ఈ ఘోరాన్ని బయటకు రాకుండా తొక్కేయడానికి తీవ్రంగా ప్రయత్నించారు.లైంగిక దాడుల కారణంగా బాధితురాలు తీవ్రనొప్పితో బాధపడుతుండగా.. తనకు బలవంతంగా మద్యం తాగించినట్లు వాపోయింది. ఇప్పటికే బాధితురాలు చెప్పిన హోటళ్ల యజమానులు, మేనేజర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీగంగానగర్ పర్యాటకంగా పెద్దగా అభివృద్ధి చెందిన ప్రాంతం కాకపోయినప్పటికీ 150కి పైగా హోటళ్లు ఉన్నాయి. తాజాగా జరిగిన ఘటన నేపథ్యంలో వాటన్నింటినీ మూసివేయాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపట్టి.. రిక్షాడ్రైవర్ తో పాటు కేసులో ఉన్న ప్రతి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. కరణ్ పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే రూపిందర్ సింగ్ కున్నర్.. నిరసనలో పాల్గొని, నిందితులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కేసులో తక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కాంగ్రెస్ హెచ్చరించింది. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల్ని సస్పెండ్ చేయాలని కూడా డిమాండ్ చేసింది.

# ఉండవల్లి ఘటన

## అంబటి రాంబాబు, పేర్ని నానిలపై అట్రాసిటీ కేసు

మొదటి పేజీ తరువాయి



వైసీపీ నేత నారాయణమూర్తి కారు అద్దం పగలగొట్టిన ఘటనపై ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు.. రైతులు, టీడీపీ నేతలపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

ఉండవల్లిలో తలెత్తిన ఉద్రిక్తలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పర్యటన విధుల్లో ఉన్న కానిస్టేబుల్ పై దాడిచేసిన బ్యాచ్ పైనే పోలీసులకు అనుమానాలు బలపడుతున్నాయి. తొలుత కొందరు వ్యక్తులు రాళ్లదాడి చేసి.. ఉద్దేశపూర్వకంగానే రైతుల్ని రెచ్చగొట్టారన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. అంతేకాక.. గతంలో టీడీపీ ఆఫీసుపై దాడిచేసిన ఘటనలో నిందితుడిగా ఉన్న చైతన్య అనే వ్యక్తి.. శనివారం గొడవలో వైసీపీ నేతల వెంట ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఉద్రిక్తతలకు కారణమైన వారందరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, పూర్తిస్థాయి ఆధారాలతో దర్యాప్తు ముమ్మరం చేశామని పోలీసులు తెలిపారు.

# ఇరాన్ అనే దేశమే లేకుండా చేస్తా డొనాల్డ్ ట్రంప్ భయంకర హెచ్చరిక

**న్యూస్ డెస్క్, 28 జూన్ (ఇది కద నిజం):** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న తాత్కాలిక సంధి కాలం ముగిసి, పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు మరోసారి పతాక స్థాయికి చేరాయి. ఇరు దేశాల మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా గనుక మళ్లీ పూర్తిస్థాయి సైనిక చర్యకు దిగాల్సి వస్తే.. ఇకపై "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్" అనే దేశమే ఉనికిలో ఉండదని ఆయన సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా హెచ్చరించారు. మరోవైపు, అమెరికా వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇరాన్ పారామిలిటరీ విప్లవాత్మక బలగాలు కువైట్, బహ్రెయిన్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డాయి.

ఘర్షణలకు దారితీసిన కారణం..

వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న దాదాపు 20 లక్షల బారెళ్ల ముడి చమురుతో ఉన్న 'కికు' అనే వాణిజ్య నౌకపై ఇరాన్ డ్రోన్లతో దాడి చేసింది. సీజ్ ఫైర్ (కాల్పుల విరమణ) ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ ఇరాన్ తీరప్రాంత రాడార్లు, వైమానిక రక్షణ కేంద్రాలు, డ్రోన్ నిల్వ స్థావరాలపై వైమానిక దాడులు నిర్వహించింది. దీనిపై స్పందించిన ట్రంప్, ఇరాన్ పదే పదే శాంతి ఒప్పందాలను ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. "మేము శాంతియుతంగా చర్చలు జరపడానికి కూడా ఒక హద్దు ఉంటుంది. ఒకవేళ ఇరాన్ ఇలాగే ప్రవర్తిస్తే.. మేము మొదలుపెట్టిన పనిని సైనిక పరంగా పూర్తిగా ముగించాల్సి వస్తుంది. అదే గనుక జరిగితే ఇరాన్ దేశం ఇకపై మ్యాప్ లోనే ఉండదు" అని ట్రంప్ హెచ్చరించారు.

కువైట్, బహ్రెయిన్లపై ఇరాన్ ప్రతీకార దాడులు..

అమెరికా దాడులకు స్పందనగా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడంతో బహ్రెయిన్, కువైట్ దేశాల్లో వైమానిక హెచ్చరిక సైరన్లు మోగాయి. బహ్రెయిన్, కువైట్ రక్షణ దళాలు తమ గగనతలంలోకి దూసుకొచ్చిన ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను, డ్రోన్లను మార్గమధ్యంలోనే విజయవంతంగా అడ్డుకున్నట్లు ప్రకటించాయి. అయితే ఈ దాడుల వల్ల తక్షణమే భారీ ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు నివేదికలు అందలేదు. అమెరికా గనుక తమపై దాడులను ఇలాగే కొనసాగిస్తే, ప్రస్తుతం ఇరు దేశాల మధ్య యుద్ధాన్ని ముగించడానికి జరుగుతున్న రాయబార చర్చలను పూర్తిగా నిలిపివేస్తామని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ హెచ్చరించింది. ఈ తాజా పరిణామాలతో అంతర్జాతీయ చమురు రవాణా మార్గాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంతర్జాతీయ పరిణామాలను మరింత వివరంగా అర్థం చేసుకోవడానికి, పశ్చిమాసియాలో అమెరికా- ఇరాన్ దాడుల తీవ్రతను దృశ్యరూపంలో చూపే ఈ పశ్చిమాసియా సంక్షోభం తాజా వార్తల వీడియో ఉపయోగపడుతుంది.

# జపాన్‌లో భారీ భూకంపం.. సునామీ హెచ్చరికలు?

**న్యూస్ డెస్క్, 28 జూన్ (ఇది కద నిజం):** భూకంపాలకు కేరాఫ్ అడ్రస్‌గా చెప్పుకునే జపాన్‌లో భారీ భూకంపం సంభవించింది. ఆదివారం తెల్లవారుజామున 6.1 తీవ్రతతో శక్తివంతమైన భూప్రకంపనలు వచ్చినట్లు జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించింది. దీనివల్ల సునామీ వచ్చే ప్రమాదమేమీ లేదని స్పష్టం చేసింది. అక్కడి కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 5.21 గంటల సమయంలో భూమి కంపించగా.. భూకంప కేంద్రం 41 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు పేర్కొంది. వరుస భూకంపాల నేపథ్యంలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నట్లు హెచ్చరించింది. వాటికి సమీపంలో ఉన్న నివాసితులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కాగా.. గడిచిన నాలుగైదు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10 భూకంపాలు సంభవించాయి. జూన్ 24న వెనిజులాలో వరుస భూకంపాలు వచ్చాయి. 7.5, 7.2 తీవ్రతతో వచ్చిన ప్రకంపనలకు వేలాది మంది ప్రజలు నిరాశ్రయులవ్వగా.. వందలాదిమంది మరణించారు. అదే రోజున జపాన్ లో 6.9 తీవ్రతతో, ఉత్తర కాలిఫోర్నియాలో 5.6 తీవ్రతతో భూకంపాలు వచ్చాయి. జూన్ 26న 6.5 తీవ్రతతో ఫిలిప్పీన్స్ లో, 5.7 తీవ్రతతో జపాన్ లో, 5.2 తీవ్రతతో నికరాగ్వాలో భూమి కంపించింది. అలాగే జూన్ 27న 5.4 తీవ్రతతో పాకిస్తాన్ లో, జూన్ 28న 6.2 తీవ్రతతో ఆఫ్ఘనిస్తాన్, భారత్ లోని కశ్మీర్, ఢిల్లీలలో ప్రకంపనలు సంభవించాయి.

# రాజకీయం అంటే పార్ట్ టైమ్ జాబ్ కాదు

## రాహుల్ గాంధీపై ప్రణబ్ ముఖర్జీ కూతురు కామెంట్స్

మొదటి పేజీ తరువాయి

తాజాగా ఓ న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన షర్మిష్ఠా రాహుల్ గాంధీపై కీలక వ్యాఖ్యలు చేశారు.

రెండు రోజులు ర్యాలీలు చేసి మాయమైతే ఎలా?

రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు మంచి ఫలితాలు వచ్చాయి. కానీ దురదృష్టవశాతు రాహుల్ కొన్ని కార్యక్రమాలు చేసి ఆ తర్వాత కనిపించకుండా పోతారని, భారత్ జోడో యాత్ర మొదటి వార్షికోత్సవం సమయంలో ఆయన ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. రాజకీయం అనేది నిరంతర ప్రక్రియ. రెండు రోజులు వచ్చి, కొన్ని ర్యాలీలు నిర్వహించి, నలుగురిని కలిసి ఆ తర్వాత వెళ్లిపోతాను అంటే కుదరదన్నారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీకి ముఖచిత్రంగా మారిన నాటి నుంచే పార్టీ పరాజయాలు మొదలయ్యాయన్నారు. 2014 నుండి కాంగ్రెస్ పార్టీకి రాహుల్ గాంధీయే ముఖచిత్రంగా ఉన్నారు. అప్పటి నుండి పార్టీ వరుసగా ఎన్నికల్లో ఓడిపోతూనే వస్తోందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజాదరణ కలిగిన బలమైన నాయకుడని ఆయనకు వస్తున్న స్పష్టమైన మెజారిటీయే అందుకు నిదర్శనం అన్నారు. కానీ రాహుల్ గాంధీ అలాంటి మెజారిటీని కాంగ్రెస్‌కు తీసుకురాలేకపోతున్నారని ఇది ఖచ్చితంగా రాహుల్ గాంధీ వైఫల్యమే అని ఆమె కుండబద్దలు కొట్టారు.

పొత్తులపైనే ఆశలు.. సొంత బలంపై శ్రద్ధ లేదు:

కాంగ్రెస్ పార్టీ కేవలం కూటములు, పొత్తుల ద్వారానే ఎన్నికల్లో గెలవాలని చూస్తోందని సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టడం లేదని షర్మిష్ఠా ధ్వజమెత్తారు. తాను కాంగ్రెస్‌లో పనిచేసిన సమయంలోనూ ఇదే ధోరణిని గమనించానని సొంత బలంతో గెలవాలనే ఉత్సాహం, ప్రోత్సాహం ప్రస్తుత నాయకత్వంలో కనిపించడం లేదని ఆమె విమర్శించారు. ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీకి మధ్య పోలిక చెప్పేందుకు ఆమె నిరాకరించారు.

# టీటీడీకి రూ.27.5 కోట్ల భారీ విరాళం 50 మంది డ్రైవర్లు, ఛార్జింగ్ స్టేషన్ కూడా!

**న్యూస్ డెస్క్, 28 జూన్ (ఇది కద నిజం):** రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ ఆదివారం (జూన్ 28) ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో సమావేశమైన అనంత్ అంబానీ.. తిరుమల అభివృద్ధికి పలు కీలక విరాళాలను ప్రకటించారు.

టీటీడీకి సుమారు రూ.27.5 కోట్ల విలువ చేసే 25 ఎలక్ట్రిక్ బస్సులను విరాళంగా అందజేస్తామని అనంత్ అంబానీ వెల్లడించారు. ఈ బస్సులు తిరుమలలో భక్తులకు పర్యావరణహిత రవాణా సేవలను మరింత మెరుగుపర్చడంలో ఉపయోగపడనున్నాయి. అంతేకాకుండా ఈ 25 ఎలక్ట్రిక్ బస్సులకు అవసరమైన 50 మంది డ్రైవర్ల జీతభత్యాలను కూడా రిలయన్స్ సంస్థ భరిస్తుందని ప్రకటించారు. అదేవిధంగా తిరుమలలో ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కూడా రిలయన్స్ సంస్థ సహకరించేందుకు అంగీకరించింది. దీంతో తిరుమలలో గ్రీన్ ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగు పడనుంది.

ఇక పశు సంరక్షణకు సంబంధించి కూడా అనంత్ అంబానీ కీలక నిర్ణయం తీసుకున్నారు. గుజరాత్‌లో రిలయన్స్ నిర్వహిస్తున్న 'వంతారా' తరహాలో తిరుమల గోశాలను ఆధునీకరించేందుకు సహకారం అందిస్తామని తెలిపారు. ఆధునిక సదుపాయాలు, మెరుగైన సంరక్షణ, పశువైద్య సేవలతో గోశాలను అభివృద్ధి చేసే దిశగా టీటీడీతో కలిసి పనిచేయనున్నట్లు వెల్లడించారు. అనంత్ అంబానీ ప్రకటించిన ఈ భారీ విరాళాలు, తిరుమలలో పర్యావరణహిత రవాణా వ్యవస్థతో పాటు గోశాల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడనున్నాయని టీటీడీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయన భక్తి భావంతో చేసిన ఈ సేవలు ప్రస్తుతం భక్తుల ప్రశంసలు అందుకుంటున్నాయి.

# తెలంగాణకు చేరిన బెజవాడ బ్రదర్స్ ఫైట్.. కేశినేని నానికి ఎంపీ చిన్ని కౌంటర్

**న్యూస్ డెస్క్, 28 జూన్ (ఇది కద నిజం):** బెజవాడ బ్రదర్స్ మాజీ ఎంపీ కేశినేని నాని వర్సెస్ ఎంపీ కేశినేని చిన్ని మధ్య విభేదాలు రోజురోజుకు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. నిన్నా మొన్నటి వరకు ఏపీ రాజకీయాలకే పరిమితం అయిన వీరి మధ్య పంచాయతీ తాజాగా తెలంగాణకు చేరింది. హైదరాబాద్ శివార్లలోని శంషీగూడలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని ఎంపీ చిన్ని కుటుంబానికి చెందిన బినామీ సంస్థ ఆక్రమిస్తోందంటూ ఏకంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి మాజీ ఎంపీ నాని ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. అయితే నాని చేసిన ఈ ఫిర్యాదుపై తాజాగా చిన్ని స్పందిస్తూ కౌంటర్ ఇచ్చారు.

ఇక మిగిలింది ట్రంప్, పుతిన్ మాత్రమే:

తాజాగా స్పందించిన చిన్ని.. 'ఈర్ష్య, ద్వేషం, కసి, పగతో నిత్యం రగిలిపోతున్న రెట్టల నాని..ఇంతకుమించి దిగజారవు అనుకున్న ప్రతిసారి ఇంకా ఇంకా దిగజారుతూనే ఉన్నావు అంటూ కౌంటర్ ఇచ్చారు. రేవులో తాడి చెట్టు మాదిరి పెరిగావు ఇంగిత జ్ఞానం మాత్రం లేదు. ప్రధానికి, రాష్ట్రపతికి ఇరువురు ముఖ్యమంత్రులకు ఫిర్యాదు చేశావ్.. ఇక మిగిలింది ట్రంప్, పుతిన్, కిమ్, కేఏ పాల్ మాత్రమే. నీరెట్టలో 1 శాతం కూడా నిజం లేదు.. పక్కకెళ్లి ఆడుకోపో' అంటూ కౌంటర్ ఇచ్చారు.

ఐటీ పార్క్ స్థలం చుట్టూ వివాదం:

కాగా శంషీగూడలో టీజీఐఐసీ ఐటీ పార్క్ కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కేశినేని నాకు కుటుంబానికి చెందిన బినామీ సంస్థ ప్రయత్నం చేస్తోందని నాని ఆదివారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రూపంలో ఫిర్యాదు చేశారు. ఐటీ పార్క్ కోసం కేటాయించిన 112.72 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవడానికి కేశినేని చిన్ని, ఆయన బినామీ సంస్థలైన 'మెసర్స్ ఎక్సెల్లా' తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని నాని ఈ లేఖలో ఆరోపించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ఇచ్చిన పాత ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టి, నకిలీ లీగల్ సెటిల్‌మెంట్లతో నిందితులు ఏకంగా సుప్రీంకోర్టును సైతం తప్పుదోవ పట్టించారని నాని ధ్వజమెత్తారు.

# ఇందిరమ్మ ఇళ్లకు కొత్త రూల్స్.. స్లాబ్ పెద్దదైతే డబ్బులు కట్.!

**న్యూస్ డెస్క్, 28 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం లబ్ధిదారులకు గృహనిర్మాణ శాఖ కీలక షాక్ ఇచ్చింది. సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకునే పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం సద్వినియోగం కావాలనే ఉద్దేశంతో కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చింది. ముఖ్యంగా, అనుమతించిన ప్లాన్‌కు మించి స్లాబ్ విస్తీర్ణాన్ని పెంచే వారిపై గట్టి నియంత్రణ విధించింది. ఇకపై నిబంధనలు అతిక్రమించి పెద్ద సైజుల్లో స్లాబులు వేస్తే ప్రభుత్వ నిధుల విడుదల నిలిచిపోతుందని స్పష్టం చేసింది. ఈ కొత్త రూల్స్ ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఇళ్లకు కూడా వర్తిస్తాయని గృహనిర్మాణ శాఖ కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

క్షేత్రస్థాయిలో చాలా మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో గోడల కంటే 3 నుంచి 8 అడుగుల వరకు స్లాబ్‌ను ముందుకు పొడిగిస్తూ భారీగా ఖర్చు పెంచుకుంటున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇలా చేయడం వల్ల ప్రభుత్వం ఇచ్చే ఐదు లక్షల రూపాయల సాయం సరిపోక, మిగిలిన మొత్తానికి పేదలు అప్పుల బారిన పడుతున్నారు. మరికొందరు ఆర్థిక భారం తట్టుకోలేక ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే వదిలేస్తున్నారు. ఈ ఇబ్బందులను అరికట్టి, ప్రభుత్వ సాయంతోనే ఇళ్లు పూర్తిగా పూర్తి కావాలనే ఆందోళనతో అధికారులు స్లాబ్ వైశాల్యంపై పరిమితులు విధించారు.

ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం.. 400 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా కలిగిన ఇంటికి స్లాబ్ వైశాల్యం గరిష్టంగా 500 చదరపు అడుగుల లోపు మాత్రమే ఉండాలి. అలాగే, 600 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా కలిగిన ఇంటికి స్లాబ్ గరిష్టంగా 750 చదరపు అడుగుల వరకే పరిమితం కావాలి. ఇంటి ముందు వైపు స్లాబ్ పొడిగింపును గరిష్టంగా 3 అడుగులకే పరిమితం చేయాలని, మిగిలిన మూడు వైపులా కేవలం ఒక అడుగు మాత్రమే పొడిగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

భారీ ఆర్సీసీ స్లాబుల పొడిగింపునకు బదులుగా, కిటికీలు , తలుపులపై సాధారణ సన్‌షేడ్లు లేదా సజ్జాలను ఏర్పాటు చేసుకోవాలని లబ్ధిదారులకు ప్రభుత్వం సూచించింది. అలాగే, ఇంటి ముందు నీడ కోసం కాంక్రీట్ స్లాబ్‌ను వాడకుండా తక్కువ ఖర్చుతో కూడిన జి.ఐ షీట్లను ఉపయోగించాలని స్పష్టం చేసింది. ఈ సరికొత్త నిబంధనలపై క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు పూర్తి అవగాహన కల్పించాలని, ఎక్కడా ఉల్లంఘనలు జరగకుండా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లను, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

# రైతులకు తీపి కబురు..రూ.8 వేల సాయం

మొదటి పేజీ తరువాయి

పంట మార్పిడికి స్వచ్ఛందంగా ముందుకొచ్చే రైతులకు ప్రోత్సాహకంగా ఎకరానికి రూ.4 వేల నుంచి రూ.8 వేల వరకు నగదు బదిలీ చేయాలని ప్రతిపాదించారు. పత్తి, పెసర, వేరుసెనగ, పొద్దుతిరుగుడు, నువ్వుల పంట సాగుచేసే రైతులకు రైతు భరోసా పంట పెట్టుబడి సాయం కాకుండా ఎకరానికి రూ.8 వేల చొప్పున, జొన్నకు రూ.5 వేలు, అలాగే మొక్కజొన్న, కంది, మినుము, ఆముదం, సోయాబీన్, శనగ పంటలకు ఎకరానికి రూ.4 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని నివేదికలో పేర్కొన్నారు.



రైతులకు కేవలం పంట మార్పిడి మాత్రమే కాకుండా.. ప్రత్యామ్నాయ పంటల కోసం స్థిరమైన, లాభదాయకమైన మార్కెట్ అవకాశాలను అందుబాటులోకి తేవడం అత్యంత అవసరమని వర్సిటీ స్పష్టం చేసింది. ముడి ఉత్పత్తుల విక్రయానికే పరిమితం కాకుండా.. వాల్యూ ఎడిషన్ ద్వారా అధిక లాభాలు పొందేలా పప్పుధాన్యాల మిల్లులు, చిరుధాన్యాలు, నూనె గింజల శుద్ధి కేంద్రాలు, అధునాతన నిల్వ, ప్యాకేజింగ్ మౌలిక సదుపాయాలు, బ్రాండింగ్ మార్కెటింగ్‌ను ప్రోత్సహించాలి. ఈ ప్రక్రియలో మహిళా స్వయం సహాయక సంఘాలు, ప్రైవేటు సంస్థలకు పెద్దపీట వేయాలి. అలాగే, ప్రత్యామ్నాయ పంటలు వేసే రైతుల్లో నష్ట భయాన్ని పోగొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి నిధులు సమకూర్చి అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ద్వారా ప్రత్యేక పంటల బీమా పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని నివేదిక సిఫార్సు చేసింది.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం


## భవన నిర్మాణ కార్మికులందరూ లేబర్ కార్డులు తీసుకోవాలి: కన్యగారి నర్సింహ్మారెడ్డి



ఇది కద నిజం,రాజేంద్రనగర్, జూన్ 28:

రాజేంద్రనగర్ మండల పరిధిలోని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం సిపిఐ మరియు బిఓసి ఆధ్వర్యంలో స్థానిక ఏ ఆర్ దేవరాజ్ భవన్ లోని సిపిఐ మండల కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్, హైదర్‌గూడ, చింతల్‌మెట్, బుద్వేల్ తదితర లేబర్ అడ్డాలకు చెందిన సుమారు 50 మంది భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డుల కోసం దరఖాస్తులను భర్తీ చేసి అప్లై చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి, సిపిఐ రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ లేబర్ అడ్డాల్లో ఇంకా చాలా మంది కార్మికులు లేబర్ కార్డులు లేకుండానే పనులు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులందరూ తప్పనిసరిగా లేబర్ కార్డులు కలిగి ఉండాలని, ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలు, ప్రమాద బీమా మరియు ఇతర లబ్ధిని ఏ విధంగా పొందాలో ఆయన కార్మికులకు క్షుణ్ణంగా వివరించారు. అర్హులైన కార్మికులందరికీ కార్డులు అందేలా తమ వంతు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సంక్షేమ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు జె. ఆనంద్ గౌడ్, మండల సహాయ కార్యదర్శి జె. విజయ్ ఆనంద్ గౌడ్, ఏఐటీయూసీ రాజేంద్రనగర్ మండలం అధ్యక్షులు ఎండి. సలీం, సిపిఐ కార్యాలయం కార్యదర్శి జి. సత్యం, మండల కౌన్సిల్ సభ్యులు జె. సదానంద గౌడ్, శ్రీరాములు, గంగారం, దర్శనాల శ్రీనివాస్, ప్రభాకర్, మణెమ్మ, మధు మరియు పెద్ద సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: సులిగే వెంకటేష్



ఇది కద నిజం, అత్తాపూర్, జూన్ 28: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని హైదర్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అత్తాపూర్ బీజేపీ డివిజన్ అధ్యక్షులు సులిగే వెంకటేష్ హాజరై, చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని పోలియో రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్న ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని, తద్వారా వారి భవిష్యత్తుకు ఆరోగ్యకరమైన పునాది వేయాలని కోరారు. ప్రభుత్వాలు మరియు ఆరోగ్య కార్యకర్తలు అందిస్తున్న ఈ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పిట్లం మండలంలో ఈఎఫ్ పంపిణీని పరిశీలించిన పిట్లం తహసీల్దార్ మహేందర్



ఇది కద నిజం: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని పోతిరెడ్డిపల్లి పోలింగ్ స్టేషన్ నెం.215తో పాటు చిన్నకొడపగల్ పోలింగ్ స్టేషన్ నెం.186, 188లలో కొనసాగుతున్న ఈఎఫ్ పంపిణీ ప్రక్రియను తహసీల్దార్ మహేందర్ పరిశీలించారు.

పంపిణీ ఏర్పాట్లు, సిబ్బంది విధులు, ఓటర్లకు అందుతున్న సేవలను ఆయన పరిశీలించి, ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈఎఫ్ పంపిణీ ప్రక్రియ సజావుగా కొనసాగుతున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

## వడ్లకొండలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన

### వడ్లకొండ గ్రామ సర్పంచ్ డెక్క సునీత - కుమార్



**ఇది కద నిజం న్యూస్, పర్వతగిరి, జూన్ 28**

జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా పర్వతగిరి మండలం వడ్లకొండలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఈ కార్యక్రమాన్ని ఆదివారం రోజున ఘనంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ డెక్క సునీత – కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, దేశాన్ని పోలియో రహితంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏ ఎన్ ఏం సుమలత,ఆశ వర్కర్స్ వి.లక్ష్మి ,వి. స్వప్న, అంగన్వాడీ టీచర్ కె. లక్ష్మి, ఆయాలు,గ్రామపంచాయతి,సిబ్బంది, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## పిట్లంలో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న పిట్లం గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూన్ 28: కామారెడ్డి జిల్లా పిట్లం గ్రామంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ ఉప సర్పంచ్ అవేజ్ బేగ్ పాల్గొని చిన్నారికి పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పోలియో చుక్కల ప్రాముఖ్యతను గుర్తించి తమ పిల్లలకు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ అవైజ్ బేగ్, అంగన్వాడీ టీచర్ కుమ్మరి రాధా వైద్య సిబ్బంది ఏఎన్ఎం మరియు ఆశ కార్యకర్తలు గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిట్లంలో డ్రైనేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూన్ 28: కామారెడ్డి జిల్లా పిట్లం గ్రామ ప్రధాన రహదారిపై చాలా కాలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా చేపడుతున్న అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ పరిశీలించారు. పనులు నాణ్యతతో, వేగంగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. గ్రామంలో మెరుగైన పారిశుధ్యం, ప్రజలకు సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అవైజ్ బేగ్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## ఐదు పెండింగ్ డీఏలు, పీఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించాలి




**తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్**

**ఇది కద నిజం న్యూస్ స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 28**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బకాయి పడిన ఐదు విడతల డీఏలను వెంటనే విడుదల చేసి, పీఆర్సీ నివేదికను అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జనగామ జిల్లా డిస్ట్రిక్ట్ ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు పెద్దెట్టి చంద్రశేఖర్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రంజిత్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఉద్యోగులకు ఈ ప్రభుత్వ హయాంలో రావాల్సిన ఒక్క డీఏ కూడా విడుదల చేయలేదని విమర్శించారు.ప్రస్తుతం ఐదు విడతల డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.పీఆర్సీ అమలులో కూడా ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని, జూలై 1తో మూడు సంవత్సరాల కాలయాపన పూర్తవుతున్నప్పటికీ నివేదికపై స్పష్టత ఇవ్వకపోవడం ఉద్యోగులను నిరాశకు గురిచేస్తోందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనను నిర్లక్ష్యం చేస్తూ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పక్కనపెట్టి కొత్త పాఠశాలల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి పెట్టడం సరైన విధానం కాదన్నారు.ఉమ్మడి సర్వీస్ నిబంధనల అమలు కూడా నిలిచిపోయిందని, రాష్ట్రవ్యాప్తంగా ఎంఈఓలు, డిప్యూటీ ఈఓలు, డీఈఓలు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, డైట్, బీఎడ్ కళాశాలలు, జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో వేలాది ఖాళీ పోస్టులు ఉన్నప్పటికీ భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు.విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీలో కూడా ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆరోగ్య భద్రత కల్పించే ఈహెచ్ఎస్‌ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.జూలై నెలలో జిల్లాలోని 12 మండలాల్లో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేయాలని సమావేశంలో తీర్మానించారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మదూరి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్, జిల్లా కోశాధికారి చిక్కుడు శ్రీనివాస్, కుటుంబ సంక్షేమ నిధి జిల్లా కన్వీనర్ గూడెల్లి కృష్ణ, జిల్లా కార్యదర్శులు కందుల శ్రీనివాస్, శ్రీహరి, తోట వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, బాలకృష్ణ, దేవీసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ ఎరువులు, విత్తనాల విక్రయాలను అరికట్టాలి

### పెరిగిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలి -రైతు సంఘం డిమాండ్




**ఇది కద నిజం న్యూస్ జఫర్గఢ్ జూన్ 28**

మండలంలోని రైతులకు కల్తీ లేని, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు నిబంధనలు పాటిస్తూ రైతులకు నాణ్యమైన ఉత్పత్తులనే విక్రయించాలని హెచ్చరించింది.రైతు సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. అధిక ధరలకు ఎరువులు విక్రయించే వ్యాపారులపై మండల వ్యవసాయ అధికారి (ఏవో) కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని, పెరిగిన ఎరువుల ధరలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతే దేశానికి వెన్నెముక అని చెప్పే ప్రభుత్వాలు రైతులపై అదనపు భారం మోపడం దురదృష్టకరమన్నారు.మద్దతు ధరలు పెంచకుండా ఫర్టిలైజర్ ధరలను విపరీతంగా పెంచడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.ఎరువుల ధరలను వెంటనే తగ్గించకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాయపురం బిక్షపతి, రాజు, రామస్వామి, కనకయ్య, నాయకులు నీరాటి కొమరయ్య, ఎర్ర రవి, జల్లెల్ల శ్రీను, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా బీజేపీ ధార్మిక సెల్ జాయింట్ కన్వీనర్‌గా బుర్ర తిరుపతి నియామకం



**ఇది కద నిజం న్యూస్ జనగామ/జఫర్గఢ్ జూన్ 28**

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్ (ధార్మిక) సెల్ జిల్లా జాయింట్ కన్వీనర్ కమిటీని రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది. ఈ కమిటీలో జనగామ జిల్లా ధార్మిక సెల్ జాయింట్ కన్వీనర్‌గా బుర్ర తిరుపతి నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నారాపరాజు రామచంద్రరావు సూచనల మేరకు, రాష్ట్ర ఎండోమెంట్ సెల్ కన్వీనర్ ఎ. సూర్యప్రకాష్, కో-కన్వీనర్ నిరంజన్ దేశాయ్ సంయుక్తంగా విడుదల చేసిన జాబితాలో ఈ నియామకాన్ని ప్రకటించారు.నియామకంపై స్పందించిన బుర్ర తిరుపతి, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ధార్మిక సెల్ ద్వారా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, ధార్మిక కార్యక్రమాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎండోమెంట్ సెల్ నాయకత్వంతో పాటు జనగామ జిల్లా పార్టీ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.బుర్ర తిరుపతి నియామకాన్ని స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ధార్మిక వర్గాల ప్రతినిధులు స్వాగతిస్తూ అభినందనలు తెలియజేశారు.

## కొడంగల్ కు తరలి వెళ్లిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జనగామ జిల్లా నాయకులు

**ఇది కద నిజం న్యూస్ జనగామ జూన్ 28**




తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసేందుకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన "చలో కొడంగల్" కార్యక్రమానికి జనగామ జిల్లా నాయకులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.జనగామ నుంచి ప్రారంభమైన వాహన ర్యాలీని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజనీకాంత్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్లలో ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జనగామ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈగం శ్రీనివాస్ మాట్లాడుతూ, కమిటీ ఏర్పాటు స్వాగతించదగ్గ నిర్ణయమే అయినప్పటికీ, అది కాలయాపనగా మారకుండా వెంటనే ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు, పెన్షన్లు, ఇంటి స్థలాలు, ఇతర సంక్షేమ పథకాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక మంది ఉద్యమకారులు కుటుంబాలను, ఉపాధిని పక్కనపెట్టి పోరాడారని, పోలీసుల లాఠీచార్జీలు, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.జీవించి ఉన్నప్పుడే ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసి ఉద్యమకారులకు న్యాయం చేయాలని, మరణించిన ఉద్యమకారుల కుటుంబాలను కూడా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు తిప్పారపు ఆనంద్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడింగుల బాలకృష్ణ, జనగామ పట్టణ అధ్యక్షురాలు గంగాభవాని, మండల అధ్యక్షుడు బొల్లం భాస్కర్, గంగారాం, లింగం తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ యూనివర్సిటీ మెస్‌లో ఉప్మాలో పురుగులు-విద్యార్థుల ఆగ్రహం

**హనుమకొండ, జూన్ 28 (ఇది కద నిజం)**



కాకతీయ యూనివర్సిటీ మెస్‌లో ఆదివారం ఉదయం వడ్డించిన ఉప్మాలో పురుగులు కనిపించాయని విద్యార్థులు ఆరోపించారు.నాసిరకం ఆహారం అందిస్తున్నప్పటికీ పలుమార్లు యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.మెస్‌లో పరిశుభ్రత, ఆహార నాణ్యతపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థులు విమర్శించారు.విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అలాగే, యూనివర్సిటీ మెస్‌లో హాస్టల్‌కు చెందని నాన్-బోర్డర్స్ కూడా భోజనం చేస్తున్నారని, దీనివల్ల అసలు హాస్టల్ విద్యార్థులకు సరిపడా భోజనం అందడం లేదని ఆరోపించారు. ఈ వ్యవహారంపై అధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపి, ఆహార నాణ్యతను మెరుగుపరచడంతో పాటు మెస్ నిర్వహణలో ఉన్న లోపాలను సరిదిద్దాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

# సినిమా న్యూస్

## ఆ తేదీన 'లెనిన్' ట్రైలర్




అక్కినేని అఖిల్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'లెనిన్'. ఈ చిత్రానికి మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తుండగా, ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై నాగార్జున, సూర్యదేవర నాగ వంశీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాను జూలై 10న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. అయితే విడుదల తేదీ సమీపిస్తున్నప్పటికీ ప్రమోషన్స్ పెద్దగా ప్రారంభం కాకపోవడంతో అక్కినేని అభిమానుల్లో ఆందోళన నెలకొంది.

ఇలాంటి సమయంలో నిర్మాత నాగ వంశీ ఈ సినిమాపై ఒక్కసారిగా హైప్ పెంచేలా భారీ ప్లాన్ సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం వినిపిస్తున్న వార్తల ప్రకారం జూన్ 30న 'లెనిన్' ట్రైలర్‌ను గ్రాండ్ ఈవెంట్ నిర్వహించి విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ట్రైలర్‌తో సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచాలన్నది నాగ వంశీ వ్యూహంగా తెలుస్తోంది. ఆయన ప్రణాళిక విజయవంతమైతే 'లెనిన్'పై భారీ బజ్ ఏర్పడే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## చివరి దశకు సంబరాల ఏటిగట్టు

టాలీవుడ్ యంగ్ హీరో సాయి దుర్గ తేజ్ ప్రస్తుతం 'సంబరాల ఏటిగట్టు' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాలో ఐశ్వర్య లక్ష్మి కథానాయికగా నటిస్తుండగా, జగపతి బాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషిస్తున్నారు. రోహిత్ కె.పీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతున్నట్లు సమాచారం.




సాయి దుర్గ తేజ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రంగా 'సంబరాల ఏటిగట్టు' నిలవనుందని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమా మంచి విజయాన్ని సాధిస్తే సాయి దుర్గ తేజ్ మార్కెట్‌తో పాటు స్టార్‌డమ్ కూడా మరింత పెరిగే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరి ఈ చిత్రంతో ఆయన ఎలాంటి విజయాన్ని అందుకుంటారో చూడాలి.

## 'రావు బహదూర్'పై
### సుకుమార్ ప్రశంసల జల్లు

తెలుగు సినిమా పరిశ్రమలో హీరోలు, దర్శకులు, నిర్మాతలు తమకు నచ్చిన సినిమాలను ప్రశంసిస్తూ వీడియోలు విడుదల చేయడం లేదా సోషల్ మీడియాలో పోస్టులు చేయడం తరచూ జరుగుతూనే ఉంటుంది. ముఖ్యంగా మంచి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంలో స్టార్ దర్శకుడు సుకుమార్ ఎప్పుడూ ముందుంటారు. తాజాగా సత్యదేవ్ హీరోగా, వెంకటేష్ మహా దర్శకత్వంలో రూపొందిన 'రావు బహదూర్' చిత్రం జూలై 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం సుకుమార్ కోసం ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసింది.

సినిమా చూసిన అనంతరం ఆయన స్పందించిన తీరు రికార్డ్ చేసి, ఆ వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఆ వీడియోలో సుకుమార్ సినిమా బృందాన్ని ప్రశంసలతో ముంచెత్తారు. "ఇలాంటి సినిమా ఇప్పటివరకు రాలేదు. ఇది అద్భుతమైన చిత్రం. ఈ సినిమాకు పనిచేసిన ప్రతి టెక్నీషియన్ తన అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు" అంటూ ఆయన చిత్ర యూనిట్‌ను అభినందించారు. స్టార్ దర్శకుడు సుకుమార్ నుంచి ఇలాంటి ప్రశంసలు రావడంతో 'రావు బహదూర్'పై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. మరి జూలై 3న విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.




## వెంకీకి పోటీగా బాలయ్య

టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోల్లో ఒకరైన విక్టరీ వెంకటేష్ ప్రస్తుతం త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఆదర్శ కుటుంబం ఏకే 47' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా కనిపించనుంది. తాజాగా ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. మరోవైపు టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం గోపీచంద్ మాలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంలో హీరోగా నటిస్తున్నారు.

ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని కూడా అక్టోబర్ నెలలోనే విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం. ఒకవేళ బాలకృష్ణ సినిమా కూడా అక్టోబర్‌లోనే విడుదలైతే, వెంకటేష్ 'ఆదర్శ కుటుంబం' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ నెలకొనే అవకాశం ఉందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దీంతో బాలయ్య చిత్రాన్ని అదే సమయంలో విడుదల చేస్తారా? లేక మరో నెల ఖరారు చేస్తారా? అనే అంశం ప్రస్తుతం ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది.

## ఇడుపు కాయితం పై రచ్చ క్లారిటీ ఇచ్చిన బన్నీ వాస్

టైటిల్ వివాదంతో ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది 'ఇడుపు కాయితం'. ఈ సినిమా యాస, భాష, టైటిల్స్ విషయంలో రెండు వర్గాలుగా విడిపోయి సోషల్ మీడియాలో ఒకరినొకరు దూసించుకుంటున్నారు. ఈ క్రమంలోనే సినిమా నిర్మాత బన్నీ వాసు టైటిల్ వివాదంపై క్లారిటీ ఇచ్చారు. 'ఏ సినిమాకైనా కథ, దాని నేపథ్యం బట్టే టైటిల్ ఉంటుంది. దీనిపై చర్చ అనవసరం. ఆంధ్రా, తెలంగాణ అని కాదు.. ఎవరైనా సరే సినిమా నచ్చితేనే చూస్తారు. నచ్చకపోతే చూడరు. కాబట్టి షూటింగ్ పూర్తయి విడుదలైన తర్వాత సినిమానే మాట్లాడుతుంది. కాబట్టి నేను చేయాల్సింది సినిమాను బాగా తీయడంపై దృష్టి పెట్టడమే. ప్రస్తుతం ఈ వివాదం వల్ల సినిమాకు కొంత ఇబ్బంది కలిగిన మాట నిజమే. సినిమా రిలీజ్ అయ్యాక అన్నీ అవే సర్దుకుంటాయి. ఫైనల్‌గా ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదు. ఒకవేళ ప్రాంతాన్ని బట్టి కథ ఉంటుందా? అంటే ఎక్కడో తీసిన హాలీవుడ్ మూవీ ఇక్కడ ఆడదు కదా.. ఇది ప్రతి ఇంటిలో ఉండే కథ. క్లైమాక్స్‌కు వచ్చే సరికి అత్తాకోడళ్లు, మామాఅల్లుళ్లు ఒకరి చేయి ఒకరు పట్టుకుని సంతోషంగా థియేటర్స్ నుంచి బయటకు వస్తారు. ఇది దర్శకుడు వచ్చిన ప్రాంతం, చూసిన వాస్తవ సంఘటనల నుంచి రాసుకున్న కథ. దీనిపై నాకు పూర్తి నమ్మకం ఉంది' అంటూ తెలిపారు.



